కంపు కొడుతున్న కుళాయి నీరు


శ్రీనివాసనగర్‌లో కుళాయి నీటి వాసన చూస్తున్న మహిళ

వేసవి ప్రతాపంతో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటి.. జీవీఎంసీ సరఫరా చేసే కుళాయి నీటిపైనే నగరవాసి ఆధారపడుతున్నాడు. అయితే జీవీఎంసీ నీటి సరఫరా విభాగం నిర్లక్ష్యం చుక్క నీటిని కూడా ఒడిసి పట్టే వీల్లేకుండా చేస్తోంది. కుళాయిల ద్వారా వస్తున్న తాగునీరు దుర్వాసన వెదజల్లుతుండటంతో ఇతర అవసరాలకూ వాటిని నిల్వ చేసుకునే ధైర్యం చేయలేకపోతున్నారు. జీవీఎంసీ 44వ వార్డులోని శ్రీనివాసనగర్‌లో గత 10 రోజులుగా ఇదే పరిస్థితి.




కుళాయి నీటిని రోడ్డుపైకి విడిచిపెడుతున్న మహిళలు

సీతంపేట:సకాలంలో పన్నులు చెల్లించండి.. జీవీఎంసీ అభివృద్ధికి సహకరించండి.. అంటూ నగరవాసులకు పదేపదే హితబోధ చేసే జీవీఎంసీ యంత్రాంగం.. ప్రజల కనీస అవసరాలను పట్టించుకోవట్లేదు. పరిశుభ్రమైన తాగునీటిని అందించాల్సిన బాధ్యతను విస్మరిస్తోంది. నగరం నడి బొడ్డులో కుళాయిల్లో కలుషిత తాగునీటి సరఫరాతో పది రోజులుగా జనం ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకపోవడం గమనార్హం. అసలే ఎండా కాలం.. తాగునీటి అవసరాలు ఎక్కువగా ఉండే రోజులు. పైగా కేవలం అరగంటపాటు అరకొరగా జరుగుతున్న నీటి సరఫరా. ఆ కాసిన్ని నీళ్లు కూడా మురుగు కంపు కొడుతుంటే.. ఎలా? అంటూ మహిళలు వాపోతున్నారు.

దుర్గంధం.. బురద నీరు

జీవీఎంసీ 44వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో డోర్ నెం.44–15–86/2, సదరం సింహాద్రి నిలయం అపార్ట్‌మెంట్ పరిసరాలలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు మురుగు కంపు కొడుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా కుళాయిలు నుంచి వచ్చే నీరు దుర్గంధంతోపాటు, బురదగా ఉంటున్నాయని చెప్తున్నారు. కుళాయిల నుంచి రోజుకు అరగంట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ బురద, దుర్గంధంతో దాదాపు తొలి పావు గంట నీటిని కాలువల్లోకే వృథాగా వదిలేస్తున్నారు. ఆ మిగిలిన పావు గంట నీటిని కూడా వాసన చూసి మరీ.. పర్లేదనిపిస్తేనే.. వాడుక నీటి కోసం నిల్వ చేసుకుంటున్నారు. తాగునీటిగా వీటిని వినియోగించే సాహసం మాత్రం ఎవరూ చేయట్లేదు.

పది రోజులుగా ఇబ్బంది



అసలే వేసవి కాలం నీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. అరగంట సేపు కుళాయి ఇస్తారు. పదిరోజులుగా కుళాయి నీరు మురుగు కంపు కొడుతోంది. నోట్లో నీళ్లు పోసుకోలేక పోతున్నాం. పావు గంట నీరు రోడ్డుపైకి వదిలేసి, ఆ తర్వాతే పట్టుకుంటున్నాం. నీళ్లు సరిపోవడం లేదు. తాగడానికి వాటర్ క్యాన్లు కొనుక్కుంటున్నాం. **– సంతోషి కుమారి, శ్రీనివాసనగర్**

సమస్య పరిష్కారం కాలేదు



కంపుకొడుతున్న కుళాయి నీటి గురించి ఫిర్యాదు చేశాం. సిబ్బంది ఐదు రోజుల కిందట వచ్చి, రోడ్డు పైన గొయ్యి తవ్వారు, పైపు లీకులేం లేవని వెళ్లిపోయారు. సమస్య మాత్రం అలానే ఉంది. పన్నులు ఠంచనుగా వసూలు చేసే జీవీఎంసీ, సరైన తాగు నీటిని అందించట్లేదు. 50కి పైగా కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. **– ఎం.లక్ష్మి, శ్రీనివాసనగర్**

సమస్య ఓ చోట.. తవ్వింది మరో చోట!

ఈ విషయమై నీటి సరఫరా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. రెండు మూడు రోజుల తర్వాత స్పందించిన సిబ్బంది.. రోడ్డుపై ఓ చోట గొయ్యి తవ్వి పైపులు బాగానే ఉన్నాయని చెప్పి, చేతులు దులిపేసుకున్నారు. వారి ముందే దుర్వాసన వచ్చిన నీళ్లను చూపినా.. అంతా బాగుందని చెప్పి వెళ్లిపోయారు. దుర్వాసన వస్తున్న నీటిని ఎలా వినియోగించేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య ఒక దగ్గర ఉంటే గొయ్యి వేరొక చోట తవ్వి, పైపులు బాగున్నాయని చెప్పి వెళ్లిపోవడంపై స్థానికులు ఆక్షేపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


గొయ్యి తవ్వి వదిలేసిన నీటి సరఫరా సిబ్బంది

క్లుప్తంగా

గణితంలో మెలకువలపై విద్యార్థులకు శిక్షణ


వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు గణితంలో మెలకువలు నేర్పించారు. గణిత ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు పాల్గొని గణిత సమస్యల పరిష్కారానికి సంబధించిన సులువైన మార్గాలను సూచించారు. గణితంలోని చతుర్విధ పరికర్మలను చేసే విధానాన్ని వివరించారు. మ్యాథ్స్‌లో ప్రావీణ్యం సాధిస్తే ఇతర సబ్జెక్టుల్లో బాగా రాణించవచ్చని చెప్పారు. గణితాన్ని చూసి భయపడకూడదని ఇంతటి సులువైన సబ్జెక్టు మరొకటి ఉండదని పేర్కొన్నారు. నిత్యజీవితంలో గణితం మన వెంటే ఉంటుందని వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలను సులువుగా పరిష్కరించి గణితంపై ఆసక్తిని పెంచారు. లైబ్రేరియన్ వై.పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన


షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం: ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ జాతికి, జంతుజాలానికి కలిగే అనర్థాలపై జీవీఎంసీ అధికారులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 50వ వార్డులోని పలు షాపుల యజమానులు, వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సెక్రటరీలు, సూపర్‌వైజర్లు చిరంజీవి, గణేష్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రింగ్‌లైట్ల స్తంభం ఏర్పాటు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. జీవీఎంసీ విద్యుత్ లైట్ల విభాగం ఏఈ అర్చన పర్యవేక్షణలో రింగ్ లైట్ల పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి జేసీబీ సహాయంతో కొత్తది అమర్చారు. ఈ పనులను కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ పరిశీలించారు. ప్రజలకు విద్యుత్ వెలుగులు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అందుబాటులోకి మ్యూజికల్ ఫౌంటెయిన్

మహారాణిపేట: సెంట్రల్ పార్క్‌లో కొంత కాలంగా నిలిచిపోయిన మ్యూజికల్ ఫౌంటెయిన్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. సుమారు రూ.22.50 లక్షలతో ఆధునికీకరించిన ఫౌంటెయిన్‌ను గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ సీహెచ్ విశ్వనాథన్‌తో కలిసి ప్రారంభించారు. నూతన పాటలతో రూపొందించిన ఈ ఫౌంటెయిన్ సెంట్రల్ పార్క్‌కు వచ్చే సందర్శకులకు అదనపు ఆకర్షణ అని ప్రణవ్ గోపాల్ తెలిపారు. దీనివల్ల సందర్శకుల సంఖ్య పెరుగుతుందని మెట్రోపాలిటన్ కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న చిన్నారులు

మల్కాపురం: మే డే వారోత్సవాల్లో భాగంగా 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద గురువారం వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా కార్మికుల సమస్యలపై, పోరాట యోధులపై రచించిన పాటలకు స్థానికంగా గల పలువురు చిన్నారులు నృత్యాలు చేశారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన జిల్లా సీఐటీయూ నాయకుడు ఎం.జగ్గునాయుడు, మల్కాపురం జోన్ కమిటీ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కార్మిక చట్టాల సాధనకు నాయకులు చేసిన పోరాటాన్ని వివరించారు. అనంతరం నృత్య ప్రదర్శన ద్వారా ఆహూతులను అలరించిన చిన్నారులకు జ్ఞాపికలను అందించారు.

ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట


ప్రతిజ్ఞ చేస్తున్న మైనారిటీ కార్పొరేషన్ ఈడీ శంసున్నీషా బేగం, ధార్మిక సంఘాల ప్రతినిధులు

సీతంపేట: ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహ రహిత విశాఖ జిల్లా సాధ్యమని మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ శంసున్నీషా బేగం అన్నారు. అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ 'యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' అనే ప్రాజెక్టులో భాగంగా అన్ని వర్గాల ధార్మిక సంఘ నాయకులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధంలో ధార్మిక సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియచెప్పడం ఎంత అవసరమో తెలిసిందన్నారు. పురోహిత సంఘ ప్రతినిధి ఆర్.రామారావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా మాకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. క్రిస్టియన్ సమాజ ప్రతినిధులు రెవరెండ్ ఇమ్మానుయేల్ సువర్ణరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు బాల్యాన్ని, విద్యను కోల్పోతున్నారని, ఎట్టి పరిస్థితుల్లో వీటిని ప్రోత్సహించరాదన్నారు. అప్‌హోల్డ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ జి.డేవిడ్‌రాజు మాట్లాడుతూ తమ సంస్థ జిల్లా, గ్రామ స్థాయిలో ప్రతి స్కూల్, కళాశాలలో బాల్య వివాహాల నిషేధంపై అనేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. బాల్య వివాహాల నిషేధానికి కృషి చేస్తామని ధార్మిక సంఘ నాయకులంతా ప్రతిజ్ఞ చేశారు. రెవరెండ్ సూర్యకిరణ్, చక్రవర్తి, కె.వై.రత్నం పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభం పునఃప్రతిష్ట


రామలింగేశ్వరాలయంలో ధ్వజ స్తంభం పునఃప్రతిష్ట


ధ్వజ స్తంభం పునఃప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ, భక్తుల శివన్నామ స్మరణ నడుమ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గవ్యాంత పూజలు, శేష హోమాలు, యంత్రార్చన, బలిహరణ, యంత్రస్థాపనం, గోదర్శనం, కళాన్యాసములు, కుంభాభిషేకం జరిపించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

'రుగ్మత' షార్ట్‌ఫిల్మ్‌కు విశిష్ట గుర్తింపు


ఉత్తమ నటుడు అవార్డు గ్రహీత పరమేశ్వరరావును అభినందిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు రూపొందించిన 'రుగ్మత' షార్ట్‌ఫిల్మ్‌కు విశిష్ట గుర్తింపు లభించింది. ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏయూ విద్యార్థులు ప్రదర్శించిన 'రుగ్మత' అందరి హృదయాలను చలింపజేసింది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ–భారతీయ చలనచిత్ర నిర్మాతల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్టీజియస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'రుగ్మత' ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌గా ఎంపికైంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన కె.పరమేశ్వరరావుకు ఉత్తమ నటుడి అవార్డు లభించింది. అవార్డు అందుకొని గురువారం ఏయూకు వచ్చిన విభాగ విద్యార్థి పరమేశ్వరరావును వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహారావు ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక సమస్యలపై అందరికీ అవగాహన కల్పించేలా చేసిన ప్రయోగం స్ఫూర్తిదాయకమన్నారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ మరబట్ల భాస్కరరావు, డాక్టర్ త్రినాథరావు, పితాని ప్రసాద్, డైరెక్టర్ వంశీలు పరమేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

• శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు.

సీసీ రోడ్, కాలువల నిర్మాణం


వెంకటేశ్వరకాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ నిర్మాణ పనులు


సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వరకాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు, సీసీ కాలువ(డ్రెయిన్)లను నిర్మిస్తున్నారు. రైల్వే న్యూ కాలనీ రోడ్ నుంచి వెంకటేశ్వర కాలనీకి వెళ్లే మార్గాన్ని రూ.14 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న డ్రెయిన్లు తొలగించి వాటి స్థానంలో కొత్తగా డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. నూతన రహదారి, డ్రెయిన్లతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంచరపాలెం రైతుబజార్‌లో కొత్త దుకాణాల నిర్మాణం


రైతుబజార్‌లో నిర్మిస్తున్న దుకాణాలు

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లోని నేల దుకాణాలకు మార్కెటింగ్ శాఖ అధికారులు మోక్షం కలిగించారు. ఇటీవల వార్తా పత్రికల్లో నేల బారు దుకాణాలు అంటు కథనాలు వెలువడటంతో ఆ దిశగా అధికారులు స్పందించారు. దుకాణాల నిర్మాణానికి టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు ప్రారంభించారు. నేల దుకాణాలకు షెడ్లు, అదనపు దుకాణాలు నిర్మిస్తున్నట్లు కంచరపాలెం రైతుబజార్ ఈవో జగదీశ్వరావు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు దుకాణాలను అందుబాటులోకి తెస్తామన్నారు.

అందరి భాగస్వామ్యంతో గ్రంథాలయాల అభివృద్ధి


ఏయూ లైబ్రరీ అధికారులు, సిబ్బందితో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ వెంకటేశ్వరరావు

విశాఖ విద్య: భావితరాలకు ఉపయోగపడేలా గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీని గురువారం ఆయన సందర్శించారు. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. తాళపత్ర గ్రంథాలను పరిశీలించి, భావితరాలకు చరిత్ర తెలిసేలా వీటిని భద్రపరచడం అభినందనీయమన్నారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇంకా ఏమైనా వసతులు కల్పించాలనే దానిపై లైబ్రరీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ నగర గ్రంథ పాఠకులతోపాటు ఏయూ క్యాంపస్ కాలేజీల విద్యార్థులకు డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలు ఎంతో సౌలభ్యంగా ఉన్నాయని చైర్మన్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. పోటీ పరీక్షార్థుల కోసం ఏర్పాటు చేసిన స్టడీ హాల్, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు.

జాషువానగర్ రహదారిలో సాఫీగా రాకపోకలు

సాక్షి ఎఫెక్ట్..


ప్రధాన గెడ్డ గోడకు ఆనుకుని ఏర్పాటు చేసిన డంపర్ బిన్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ పరిధి జాషువానగర్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం రాంగ్ పార్కింగ్‌లతో ఆక్రమణకు గురైంది. ఇక్కడి రహదారిలో జీవీఎంసీ డంపర్ బిన్‌ను అడ్డంగా పెట్టడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'ప్రధాన రహదారిలో రాకపోకలకు తంటాలు' అనే శీర్షికన ఈ నెల 6న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జోన్–5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ పర్యవేక్షణలో డంపర్ బిన్‌ను ప్రధాన గెడ్డకు ఆనుకుని ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు, వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు


స్లీవ్‌గుర్తు వీధిలో పైప్‌లైన్లకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జ్ఞానాపురంలోని స్లీవ్‌గుర్తువీధి, మాన్యువల్‌స్ట్రీట్, రొసీలియన్ స్ట్రీట్‌లో మంచినీటి పైపులైన్లు కలుషితం అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పైప్‌లైన్లకు సమీప కాలువల్లో మురుగు చేరడంతో ఆ పైప్‌ల ద్వారా ఇళ్లలోకి మురుగు నీరు సరఫరా అవుతుందని, ఈ విషయం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమకు ఫిర్యాదు చేశారు. ఆమె సంబంధిత మంచినీటి విభాగం అధికారులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పర్యవేక్షణలో మంచినీటి సిబ్బంది డ్రైనేజీల్లో ఉన్న పైప్‌లైన్ల తొలగింపు పనులు చేపట్టారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి మంచినీరు సరఫరా అయ్యేటట్లు చూస్తామని ఏఈ సుమన్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వేళంగిణి రావు, మురళి, కుమార్, మంచినీటి విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: ఈ నెల 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్ కమిటీలు పిలుపునిచ్చాయి. మద్దిలపాలెం కార్యాలయంలో గురువారం సమ్మె పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.వెంకటరావు, డి.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇవి అమలైతే కార్మిక వర్గం అనేక హక్కులను కోల్పోతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలు ఆపాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. విశాఖ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో జాతీయ సమ్మెపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 20న సమ్మె పాటిస్తూ కార్మిక వర్గం మొత్తం రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ, అనంతరం సభ జరుగుతాయని చెప్పారు. సీఐటీయూ నాయకులు నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, ఐసీ నాయుడు, ఎ.సింహాచలం, లక్ష్మణరావు, వెంకటరమణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.